సాక్షి అనకాపల్లి

శనివారం । 26 । ఆగస్టు । 2023



సమ'కూర' ధరలోన..

8లో

కూర'గాయాలు' మానుతున్నాయి. ధరలు దిగిరావడంతో వినియోగదారులు ఊరట చెందారు. టమాటా ధర రూ.35కి తగ్గింది.



ప్లేస్‌మెంట్ సెల్ ప్రారంభం

విశాఖ: ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఆధునికీకరించిన ప్లేస్‌మెంట్ సెల్‌ను వీసీ ప్రసాదరెడ్డి శుక్రవారం ప్రారంభించారు.

స్వల్ప వర్షసూచన

అనకాపల్లిటౌన్: రాగల మూడు రోజులు స్వల్ప వర్షసూచన ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి శుక్రవారం తెలిపారు. ఈ నెల 26న 8, 27న 8, 28న 4 మి.మీ. చొప్పున వర్షం, 33.2 నుంచి 33.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతాయన్నారు.

న్యూస్‌రీల్

స్కిల్ హబ్‌లో కొత్త కోర్సులపై ఉచిత శిక్షణ

తుమ్మపాల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ స్కిల్ హబ్‌ల ద్వారా నిరుద్యోగ యువతకు పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ అందించి, ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని స్కిల్ హబ్ ఇన్‌చార్జి ఎ.చక్రవర్తి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రేబాకలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వచ్చే నెల 4న కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్, డొమెస్టిక్ నాన్ వాయిస్ కోర్సులపై కొత్త బ్యాచ్‌కు ఉచిత శిక్షణ ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఈ శిక్షణ తరగతులకు టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లమోలో ఉత్తీర్ణత సాధించిన యువతీ యువకులు పాల్గొనవచ్చన్నారు. కేవలం 30 సీట్లు మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 28న నేరుగా కళాశాలకు వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెం.7013342667, 8143229228కు సంప్రదించాలన్నారు.

ఉద్యోగ కల్పనే లక్ష్యం

సాక్షి, విశాఖపట్నం: ఉపాధి హామీ పథకంలో 100 రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న కూలీల కుటుంబాల్లో పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన పిల్లలకు 'ఉన్నతి' కార్యక్రమం ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని డీఆర్‌డీఏ పీడీ ఎం.ఎస్ శోభారాణీ, డ్వామా పీడీ ఇ. సందీప్ అన్నారు. శుక్రవారం డీఆర్‌డీఏ కార్యాలయంలో విశాఖ, అనకాపల్లి జిల్లాల సీడాప్ అధికారులు, శిక్షణ సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ ఎం.ఎస్ శోభారాణీ, డ్వామా పీడీ సందీప్ మాట్లాడుతూ..2018 నుంచి 2024 ఆర్థిక సంవత్సరాల మధ్య 100 రోజులు పూర్తి చేసుకున్న..అర్హత కల్గిన ప్రతీ ఒక్కరికీ శిక్షణ కల్పించేలా అధికారులంతా అవగాహన కల్పించాలని ఆదేశించారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో క్లస్టర్ల వారీగా శిక్షణకు ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీడాప్ సిబ్బంది పాల్గొన్నారు.

15, 16 తేదీల్లో అగ్నిపథ్ వాయు-వాద్యకారుల ఎంపిక

తుమ్మపాల : వాయుసేనలో వాద్యకారుల ఎంపిక నిర్వహిస్తున్నట్లు రిక్రూట్‌మెంట్ అధికారి గురుప్రీత్ అత్వాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్ బేగంపేట భారత యువసేనలో వచ్చే నెల 15, 16 తేదీల్లో అగ్నిపథ్ వాయు- వాద్యకారుల ఎంపికకు కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, లక్షద్వీప్, పాండిచ్చేరి ప్రాంతాల నుంచి అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. శరీర దారుఢ్యం కలిగి, ఫ్లూట్, క్లారినెట్, శాక్సాఫోన్, కీబోర్డు, ఆర్గాన్, పియానో, గిటార్, వయోలిన్, క్లాసికల్ ఇన్‌స్ట్రుమెంట్స్‌లో డిప్లమో లేదా డిగ్రీ కలిగి ఉండాలన్నారు. 162 సెంటీమీటర్ల ఎత్తు, తగిన బరువు ఉండాలన్నారు. ఛాతీ 5 సెంటీమీటర్ల వరకు విస్తరించగలగాలని, స్పష్టమైన కనుచూపు ఉండాలని తెలిపారు. మరిన్ని వివరాలకు agnipathvayu.cdac.in./AV వైబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు.

బాల్య వివాహానికి అడ్డుకట్ట

మాకవరపాలెం: బాల్య వివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు అడ్డుకున్నారు. మండలంలోని రామన్నపాలెంలో బాల్య వివాహం జరుగుతున్నట్టు అందిన సమాచారంతో సీడీపీవో మేరీ సువార్త పోలీసులతో శుక్రవారం గ్రామానికి చేరుకున్నారు. బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, నిబంధనలకు విరుద్ధంగా వివాహం చేస్తే శిక్షార్హులని తెలిపారు. దీంతో వివాహం నిలిపివేశారు.

లోకేష్, అచ్చెన్నలపై ఫిర్యాదు



సీఐ దాడి మోహన్‌రావుకు ఫిర్యాదు చేస్తున్న సోషల్ మీడియా సభ్యులు

అనకాపల్లి టౌన్: టీడీపీ కార్యకర్తలను రెచ్చగొడుతూ దాడులకు ప్రేరిపిస్తున్న నారా లోకేష్, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణ, గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో జిల్లా సోషల్ మీడియా కో కన్వీనర్ సూరంపూడి శ్రీకాంత్ శుక్రవారం ఫిర్యాదు చేశారు. మాచెర్ల, పుంగనూరు ఘటనలే ఇందుకు నిదర్శనమని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ రాయవరపు జోగిరాజు, మండల కన్వీనర్ పల్లెల దొరబాబు, మండల కో-కన్వీనర్ కశ్లేపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపు నర్సీపట్నంలో ఉద్యోగ మేళా

నర్సీపట్నం: ఈ నెల 27న రిషి డిగ్రీ కళాశాలలో విశాఖ, హైదరాబాద్‌కు చెందిన కోహన్స్ ఫార్మా, అరబిందో ఫార్మా, హెటిరో డ్రగ్స్, గ్రాన్యూల్స్ ఇండియా, గ్రావిటీ ఫార్మా సంస్థ వారు ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నారని కళాశాల ప్రిన్సిపాల్ కె.సతీష్ తెలిపారు. ఇంటర్వ్యూలో ఎంపికైన అభ్యర్థులకు విశాఖపట్నంలోని ఎస్‌డీఐ-సీఎంఎస్ స్కిల్ సెంటర్‌లో 45 నుంచి 60 రోజుల ఉచిత శిక్షణ అందించి, ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు.

మంగళకారిణి.. సౌభాగ్య ప్రదాయిని



మహాలక్ష్మీదేవి అలంకరణలో శతకంపట్టు కనకదుర్గమ్మ



అనకాపల్లి నూకాంబిక ఆలయంలో భక్తుల కుంకుమార్చనలు

సకల సౌభాగ్యాలు ప్రసాదించే శ్రావణ లక్ష్మి పూజలతో ప్రతి ఇల్లూ ఓ దేవాలయమైంది. మంగళకరమైన వరలక్ష్మీ వ్రతాన్ని, మహిళలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. అమ్మవారిని సుందరంగా అలంకరించి జిల్లా అంతటా ప్రత్యేక పూజలు జరిపారు. గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీదేవి పూజ నిర్వహించారు. కుంకుమ పూజల్లో మహిళా భక్తులు పాల్గొన్నారు. గవరపాలెం శతకంపట్టు కనకదుర్గమ్మవారి ఆలయంలో అమ్మవారికి లక్ష్మీపూజ చేశారు. -అనకాపల్లి టౌన్

సీఎం జగన్‌కు ఘన స్వాగతం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు



ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న అనకాపల్లి ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి

సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. పార్వతీపురం మన్యం జిల్లా చిన్నమేడపల్లి గ్రామంలో సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ శంకుస్థాపనకు హాజరయ్యేందుకు శుక్రవారం ఉదయం 10.10 గంటలకు సీఎం విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, భీశెట్టి వెంకట సత్యవతి, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, కలెక్టర్ మల్లికార్జున, సీపీ త్రివిక్రమ్ వర్మ, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, జేసీ విశ్వనాథన్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి సీఎం వైఎస్ జగన్‌కు స్వాగతం పలికారు.

ఆత్మీయ పలకరింపు

మన్యం జిల్లా పర్యటన ముగించుకుని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో కలిసి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హెలికాప్టర్లో తిరిగి మధ్యాహ్నం 1.45 గంటలకు విశాఖ విమానాశ్రయం చేరుకున్నారు. ప్రజాప్రతినిధులను ఆత్మీయంగా పలకరించారు. వీఐపీ లాంజ్‌లో దాదాపు గంటపాటు రిజర్వ్‌లో ఉన్నారు. డిప్యూటీ సీఎం, మంత్రులను, మేయర్, ఎంపీలను, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, సమన్వయకర్తలను ఒక్కొక్కరినీ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు పరిచయం చేశారు. అనంతరం తాడేపల్లికి తిరుగుపయనమయ్యారు.

ప్రకృతి వ్యవసాయంపై అధ్యయనం

- మహిళా రైతులతో నేపాల్ బృందం ముఖాముఖి
- చీడికాడ మండలంలో చిరుధాన్యాల సాగు పరిశీలన



చీడికాడలో ప్రకృతి వ్యవసాయ సూర్యమండల చక్రాన్ని పరిశీలిస్తున్న నేపాల్ బృంద సభ్యులు

చీడికాడ : మండల కేంద్రం చీడికాడలో నేపాల్ దేశానికి చెందిన 15 మందితో కూడిన గ్రౌండ్స్ వెల్ ఇంటర్నేషనల్ ఎన్జీవో బృందం శుక్రవారం పర్యటించింది. ఈ మేరకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అధ్యయనం చేయడంలో భాగంగా నాబార్డు సంస్థతో కలిసి ఈ బృందం పర్యటించిందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ (డీపీఎం) లచ్చన్న తెలిపారు. బృంద సభ్యులు ప్రకృతి వ్యవసాయం చేసే రైతులతో సమావేశమయ్యారు. ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన ఘన, ద్రవ జీవామృతం కషాయాలను బృంద సభ్యుల సమక్షంలోనే స్థానిక రైతులు తయారు చేశారు. ఈ సందర్భంగా చిరు ధాన్యం విత్తనాలతో తయారు చేసిన సూర్య మండలం చక్రాన్ని ఆసక్తిగా తిలకించి వారి సెల్ ఫోన్లలో బంధించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులతో మాట్లాడి ఆదాయం ఎంత మేర వస్తుందో ఆరా తీశారు. ప్రకృతి పద్ధతిలో ఎస్టీఎస్ వరి పంటను వేసిన కాంపాక్ట్ బ్లాక్ పొలాలను బృంద సభ్యులు పరిశీలించారు. మహిళా రైతులతో సమావేశమై ఈ పద్ధతిలో సాగు చేయడం ద్వారా కలిగే ప్రయోజనాలు, లాభ నష్టాలను సమగ్రంగా అడిగి తెలుసుకున్నారు. చీడికాడలో పర్యటించిన నేపాల్ దేశానికి చెందిన బృందంలో నవ్రాజ్ ఉపాధ్యాయ, సరిత వైబా, ఉషా శ్రేష్టా, రితా మైనాలి, హరికల ప్యాడెల్, ప్రాబిన్ కుమార్ తపా తదితరులు ఉన్నారు. ప్రకృతి వ్యవసాయ రాష్ట్ర మార్కెటింగ్ విభాగం టీఎల్ ప్రకాష్‌రావు, రీజనల్ అధికారులు కృష్ణారావు, హేమసుందర్ పాల్గొన్నారు.

డాక్టర్ శ్రావణ్‌కుమార్‌కు డీసీహెచ్‌గా పదోన్నతి



అనకాపల్లి టౌన్: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కె.శ్రావణ్‌కుమార్‌కు డీసీహెచ్‌గా పదోన్నతి లభించింది. కృష్ణాజిల్లా ప్రభుత్వాస్పత్రిలో సోమవారం డీసీహెచ్‌గా శ్రావణ్‌కుమార్ బాధ్యతలు చేపట్టనున్నారు. ఇక్కడి సూపరింటెండెంట్ పోస్టు భర్తీ కావాల్సి ఉంది.

యలమంచిలి మున్సిపల్ కమిషనర్‌గా కొండలరావు

యలమంచిలి: పురపాలక సంఘ కమిషనర్‌గా కె.ఎ.కొండలరావును ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఏలేశ్వరం నగర పంచాయతీ కమిషనర్‌గా ఉన్న ఆయనను యలమంచిలి కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వ పట్టణ పురపాలక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి జీవో జారీ చేశారు. కొద్ది నెలల క్రితం యలమంచిలి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన తోట కృష్ణవేణిని అధికారులు పిఠాపురం మున్సిపాల్టీకి బదిలీ చేశారు. అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉంది. మున్సిపల్ డీఈ కె.వీరయ్య ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కొత్త కమిషనర్‌గా కొండలరావు త్వరలో ఇక్కడ బాధ్యతలు స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు.

సింహాద్రి ఎన్టీపీసీలో పార్లమెంటరీ కమిటీ



ఎన్టీపీసీ సింహాద్రి హిందీ పత్రిక సువాసికను ఆవిష్కరిస్తున్న కేంద్ర బృందం

పరవాడ : సింహాద్రి ఎన్టీపీసీలో అమలు జరుగుతున్న రాజభాష కార్యకలాపాలను పార్లమెంట్ కమిటీ రెండో ఉప సంఘం శుక్రవారం పరిశీలించింది. పార్లమెంటు కమిటీ ఉప సంఘ కన్వీనర్ రంజన్ బెన్ భట్ అధికార భాషా విధానానికి అనుగుణంగా జరుగుతున్న పనులను పరిశీలించారు. అధికార భాష హిందీని ఉపయోగించడం కోసం సింహాద్రి ఎన్టీపీసీ చేస్తున్న కృషిని ప్రశంసించారు. పార్లమెంటు సభ్యురాలు మాల రాజ్యలక్ష్మీ షా, సంగీతా అధికార భాషా లక్ష్యాల పురోగతిపై చర్చించారు. సింహాద్రి ఎన్టీపీసీ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా, విద్యుత్ మంత్రిత్వశాఖ ఎకనామిక్ అడ్వైజర్ జితేష్ జాన్ మాట్లాడారు. అనంతరం ఎన్టీపీసీ సింహాద్రి హిందీ పత్రిక 'సువాసిక'ను పార్లమెంటరీ కమిటీ బృందం ఆవిష్కరించింది. ఈ కార్యక్రమంలో మానవ వనరుల చీఫ్ జనరల్ మేనేజర్ సి.కుమార్ పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో వినూత్న మార్పులు

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి
- సురవరం కేజీబీవీ ఆకస్మిక తనిఖీ



మాడుగుల మండలం సురవరం కేజీబీవీలో విద్యార్థుల చైల్డ్ ఇన్ఫో హాజరు వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి

మాడుగుల: విద్యా వ్యవస్థలో ప్రభుత్వం వినూత్న మార్పులు తీసుకు వచ్చిందని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. మండలంలో సురవరం వద్ద ఉన్న కేజీబీవీ పాఠశాలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటశాలతో పాటు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం వంటలు తయారు చేయడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆహార పదార్థాల నాణ్యత, తరగతుల నిర్వహణ, వసతుల కల్పనపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అన్నీ బాగున్నాయని విద్యార్థులు బదులివ్వడంతో కలెక్టర్ ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం చైల్డ్ ఇన్ఫో రేషియో ఎలా ఉందని సిబ్బందిని, వలంటీర్లను ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యాలయాల్లో ప్రభుత్వం అనేక వసతులు కల్పిస్తుందని, వీటిని సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థినులకు కార్పొరేట్ స్థాయిలో బోధన సాగించి ధీటుగా తయారు చేయాలన్నారు. అనంతరం కేజే పురంలోని జగనన్న లేఅవుట్‌ను పరిశీలించారు. ఈ లేఅవుట్‌లో 16 ఇళ్లు మంజూరు కాగా.. ఐదిళ్లు పూర్తయ్యాయి. మిగతా వారు కూడా ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయించాలని గృహ నిర్మాణ శాఖ ఏఈ సత్యనారాయణను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పీవీ రత్నం, డీటీ సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కలల గూడుకు సకల సదుపాయాలు

- పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పన
- ఆదర్శంగా జగనన్న కాలనీలు
- సొంతింటి కల నెరవేరిందన్న ఆనందంలో లబ్ధిదారులు
- పారదర్శకంగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు సొమ్ము జమ
- జిల్లాలో 681 జగనన్న లేఅవుట్లలో కొనసాగుతున్న నిర్మాణాలు



చీడికాడ మండలం చినగోగాడ జగనన్న లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న పక్కా గృహాలు



రావికమతం మండలం గొంప గ్రామంలో నిర్మాణ దశలో జగనన్న పక్కా గృహాలు



కె.జె.పురం జంక్షన్‌లో పూర్తయిన జగనన్న లేఅవుట్‌లో పక్కా గృహాలు



మాడుగుల రామచంద్రపురం వద్ద నిర్మాణంలో ఉన్న పక్కా గృహాల సముదాయం

అనకాపల్లి జిల్లాకు మంజూరైన జగనన్న లేఅవుట్లు	729
వివిధ కారణాల వల్ల రద్దు చేసిన లేఅవుట్లు	48
ప్రస్తుతం నిర్మాణంలో వున్న లేఅవుట్లు	681

జిల్లాకు మంజూరైన పక్కా గృహాలు	58,624
పునాది స్థాయిలో	11,733
బేస్‌మెంట్ వరకు పూర్తయినవి	22,357
రూఫ్ లెవెల్ (ఆర్ఎల్)	3176
శ్లాబ్ నిర్మాణ దశలో	1,880
గృహ ప్రవేశాలు జరిగినవి	14,549

జిల్లాలో సొంత స్థలాలు ఉన్న వారికి మంజూరైన ఇళ్లు	20,120
ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం (గ్రామీణ)	4,383

మాడుగుల రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం పక్కా గృహాలు లేని నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చే లక్ష్యంతో జగనన్న లేఅవుట్లలో ఉచితంగా స్థలాలు అందించి, వారికి పక్కా గృహాలు మంజూరు చేసే బృహత్తరమైన పనికి శ్రీకారం చుట్టింది. గతంలో గృహ నిర్మాణానికి నిధులు మంజూరు చేసేవారు. నేడు రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో లబ్ధిదారుకు సెంటున్నర స్థలం ఉచితంగా ఇచ్చి, అందులో పక్కా గృహం నిర్మాణానికి రూ.1.80 లక్షలు మంజూరు చేసిన ఘనత సొంతం చేసుకుంది. జగనన్న లేఅవుట్ల పేరుతో ప్రతి గ్రామంలో సామూహికంగా ఉచితంగా స్థలాలు అందించి, అక్కడే ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఎంతోమంది గూడు లేని వారికి ఈ పథకం ద్వారా సొంతింటి కల నెర వేరింది.

అంతర్గత రహదారులు, డ్రైనేజీల నిర్మాణం

జగనన్న లేఅవుట్లలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్ద పీట వేసింది. లేఅవుట్లలో అంతర్గత రహదారులు, విద్యుత్, డ్రైనేజీల నిర్మాణం, అప్రోచ్ రోడ్లు, నీటి సదుపాయం కల్పిస్తోంది. ప్రతి లబ్ధిదారుకు సిమెంట్, ఇనుము, మార్కెటు రేటు కంటే తక్కువ రేటుకు అందించడమే కాకుండా, ఇసుకను ఉచితంగా అందిస్తోంది. వీటితో పాటు సిమెంటు ద్వారబంధాలు, కిటికీలు, లబ్ధిదారుకు రవాణా ఖర్చులు మినహా ఉచితంగా ఇసుక అందిస్తున్నారు.

సొంత స్థలం ఉన్న వారికి కూడా...

సొంత స్థలం ఉన్న లబ్ధిదారులకు పక్కా ఇళ్లు జిల్లా వ్యాప్తంగా 20,120 మంజూరైనట్టు జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి కె.రమామణి తెలిపారు. దీంతోపాటు ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో 4,383 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని, ప్రతి శనివారం మండల స్థాయిలో హౌసింగ్ నిర్మాణాల గురించి మండల స్థాయిలో ప్రత్యేక అధికారిని నియమించారు. జిల్లా స్థాయి అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించడంతో ప్రతి శనివారం మండలంలో రెండు జగనన్న లేఅవుట్లు పరిశీలించి, లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నట్టు ప్రాజెక్టు డైరెక్టరు తెలిపారు.

సకాలంలో చెల్లింపులు

ప్రస్తుతం నిర్మించిన గృహాలకు సకాలంలో లబ్ధిదారులకు చెల్లింపు చేస్తున్నారు. నిరంతరం గ్రామస్థాయిలో గల సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులతోపాటు గృహ నిర్మాణశాఖ ఏఈ, డీఈఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఇళ్ల నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్నారు. గతంలో కంటే ప్రస్తుతం జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులకు సకాలంలో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు నగదును పారదర్శకంగా జమ వేస్తున్నారు. అధికారుల నిరంతర పర్యవేక్షణ జరుగుతుంది. గ్రామాల్లో ప్రభుత్వం మంజూరు చేసిన స్థలం విలువ కూడా పెరిగిందని, ఈ దశలో ప్రభుత్వం ఉచితంగా స్థలం అందించి, పక్కా గృహ నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం పట్ల లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

జగనన్నకు రుణపడి ఉంటాను



మేము మాడుగుల మండలం కె.జె.పురం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన వారం. కూలి పని చేసుకుని జీవిస్తున్నాం. సొంతిల్లు లేదు. 23 సంవత్సరాల క్రితం వివాహం అయింది. అప్పటి నుంచి గ్రామంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాం. సొంత స్థలం కూడా లేదు. కె.జె.పురం జంక్షన్‌లో జగనన్న లేఅవుట్‌లో సెంటున్నర స్థలం పట్టా ఇచ్చారు. ఇంటి నిర్మాణం పూర్తయింది. గృహప్రవేశం కూడా అయింది. ప్రస్తుతం జగనన్న మంజూరు చేసిన ఇంటిలో నివాసం ఉంటున్నాం.

-కోయిలాడ లక్ష్మి, కె.జె.పురం గ్రామం, మాడుగుల మండలం

సొంతింటి కల నెరవేరింది



ప్రభుత్వం అందించిన ఉచిత స్థలంలో పక్కా గృహం నిర్మించుకుంటున్నాం. మా కల నెరవేరింది. పక్కా గృహాలు లేని ఎంతో మందికి జగనన్న పేదల పెన్నిధి. అద్దె ఇంట్లో ఉంటున్న మాకు జగనన్న లే అవుట్‌లో పక్కా గృహం మంజూరు చేయడంతో మా కుటుంబం ఎంతో ఆనందంగా ఉంది. మేము గృహ ప్రవేశం కూడా చేశాం.

-పెంటకోట వెంకటలక్ష్మి, కె.జె.పురం, మాడుగుల మండలం

లేఅవుట్లలో పూర్తి సదుపాయాలు

జిల్లావ్యాప్తంగా జగనన్న లేఅవుట్లలో మౌలిక సదుపాయాలు కల్పించాం. విద్యుత్, నీటి సదుపాయంతోపాటు అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాం. అప్రోచ్ రోడ్లు నిర్మించాం. ఇంకా ప్రారంభం కాని ఇళ్ల నిర్మాణం కోసం లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నాం. అవసరమైన చోట లేవుట్ల లెవెలింగ్ చేపడుతున్నాం. నిర్మాణాలు జరుగుతున్న ఇళ్లకు సంబంధించిన పేమెంట్లు ఎప్పటికప్పుడు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నాం.

-కె.రమామణి, జిల్లా హౌసింగ్ అధికారి, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్, అనకాపల్లి జిల్లా

సమ'కూర' ధరలోన..

- దిగి వచ్చిన కూరగాయల ధరలు
- కిలో రూ.200 నుంచి రూ.35 కి తగ్గిన టమాటా
- కిలో రూ.120 నుంచి రూ.50కి తగ్గిన పచ్చిమిర్చి
- దాదాపు అన్ని రకాలు రూ.50లోపే
- పేద, మధ్య తరగతి ప్రజలకు ఊరట

అనకాపల్లి రూరల్: నెల రోజులుగా పేద, మధ్య తరగతి ప్రజలకు దడ పుట్టించిన కూరగాయల ధరలు తగ్గుముఖం పట్టాయి. దిగుబడులు లేక గతంలో అమాంతం పెరిగిన వీటి ధరలు ప్రస్తుతం దిగిరావటం ఊరటనిస్తోంది. 50 రోజుల క్రితం టమాటా, మిర్చి ధరలు ఆకాశాన్నంటడంతో కొనలేని పరిస్థితి నెలకొంది. రికార్డు స్థాయిలో కిలో రూ.200కి చేరిన టమాటా ప్రస్తుతం రూ.35కి తగ్గిపోగా, కిలో రూ.120 పలికిన పచ్చిమిర్చి రూ.50కి వచ్చింది. ఇతర కూరగాయల ధరలు సైతం కిలో రూ.50 లోపే ఉండటంతో కొనుగోలుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఏడాది రుతుపవనాల రాక ఆలస్యంతో వర్షాలు లేకపోవడం, ఎండల తీవ్రత ఎక్కువవడంతో కూరగాయల దిగుబడి తగ్గిపోయింది. సాధారణంగా జూన్, జూలై నెలల్లో అంతంత మాత్రంగా ఉండే కూరగాయల ధరలు ఈ సారి దిగుబడి లేక భారీగా పెరిగిపోయాయి. ప్రధానంగా వంటల్లో ఎక్కువగా వినియోగించే టమాటా, పచ్చిమిర్చి, అల్లం ధరలు ఒక్కసారిగా అమాంతం పెరిగిపోయాయి. వీటితో పాటు వంకాయ, బీర, బెండ, దొండ, మునగ తదితర కూరగాయల ధరలు రూ.60 నుంచి రూ.70కి చేరి సామాన్యులకు చుక్కలు చూపించాయి. టమాటా కొనాలంటేనే సామాన్యులు బెంబేలెత్తిపోవాల్సిన పరిస్థితి ఉండేది. ఈ తరుణంలో ప్రజలపై భారం పడకుండా రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై కిలో టమాటా రూ.50కే రైతుబజార్లలో విక్రయించేలా చేసింది. అయితే ప్రస్తుతం కూరగాయల ధరలన్నీ ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. అనకాపల్లి పట్టణంలో కూరగాయల మార్కెట్‌తోపాటు తుమ్మపాల, కొత్తూరు మేజర్ పంచాయతీలు, గ్రామాల్లో జరిగే వారపు సంతల్లో కూరగాయల ధరలు తగ్గడంతో పేద, మధ్యతరగతి ప్రజలు ఊరట చెందారు.



పట్టణంలోని ఓ దుకాణంలో విక్రయానికి సిద్ధంగా ఉంచిన కూరగాయలు

తగ్గిన కూరగాయల ధరలిలా..

కూరగాయలు	కిలోల్లో ధర
టమాటా	రూ.30 నుంచి రూ.35,
పచ్చిమిర్చి	రూ.50 నుంచి రూ.60
ఉల్లి	రూ.25 నుంచి రూ.28
బీరకాయ	రూ.40 నుంచి రూ.45
దొండ	రూ.30 నుంచి రూ.35
బెండ	రూ.25 నుంచి రూ.30
వంకాయలు	రూ.36 నుంచి రూ.40
బంగాళ దుంపలు	రూ.38 నుంచి రూ.42

ఉల్లి దిగుమతి..

చిత్తూరులో టమాటా దిగుబడులు పెరగడం, పొరుగు జిల్లాల నుంచి పంట ఉత్పత్తులు అందుబాటులోకి రావడంతో పది రోజులుగా ధరలు దిగివస్తున్నాయి. మరోవైపు ఉల్లి ధర క్రమంగా పెరుగుతోంది. పది రోజుల క్రితం కిలో రూ.20 ఉన్న ఉల్లి ప్రస్తుతం రూ.28కి చేరుకుంది. రాష్ట్రంలో పెద్దగా ఉత్పత్తి లేకపోవడం, మహారాష్ట్రలోని నాసిక్, శ్రీరాంపురం, షోలాపూర్ ప్రాంతాల నుంచి వ్యాపారులు ఉల్లిని దిగుమతి చేసుకుంటున్నారు. రవాణా చార్జీలు కలిపితే మార్కెట్‌కు సరుకు చేరేసరికి ధర పెరుగుతోందని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు.

ధరలు తగ్గాయి



కూరగాయల ధరలు తగ్గడం సంతోషంగా ఉంది. ప్రధానంగా ప్రతి కుటుంబంలో వంటల్లో విరివిగా ఉపయోగించే టమాటా, మిర్చితోపాటు ఇతర కూరగాయల ధరలు తగ్గడంతో నిరుపేదలు, మధ్య తరగతి ప్రజలు కొనుగోలు చేయగలిగే అవకాశం ఏర్పడింది. ప్రస్తుతం ఏ కూరగాయలు కొనాలన్నా కిలో రూ.50 లోపే ఉంటున్నాయి. ధరలు విపరీతంగా పెరిగిపోయినప్పుడు ప్రభుత్వం రైతు బజార్ల ద్వారా సబ్సిడీపై టమాటాలు విక్రయించడం కొంత మేర ఉపశమనాన్ని కలిగించిందనే చెప్పాలి.

– కేవీఎస్ ఇంద్రజ, రాంనగర్, అనకాపల్లి

పేదలకు అందుబాటులో ధరలు



నెల రోజుల క్రితం హడలెత్తించిన కూరగాయల ధరలు ప్రస్తుతం అందరికీ అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా వారం రోజులుగా ధరలు తగ్గుముఖం పట్టడంతో పేద, సామన్య వర్గాల ప్రజలు అన్ని రకాల కూరగాయలను కొనుగోలు చేస్తున్నారు. గతంలో మార్కెట్‌కు రూ.500 తీసుకెళ్లినా కుటుంబ అవసరాలకు సరిపడా కూరగాయలు వచ్చేవి కావు. ఇప్పుడు శ్రావణమాసంలోనూ ధరలు తగ్గడం కష్టజీవులకు ఊరటనిస్తోంది.

– ఆదారి నాయుడు, గవరపాలెం, అనకాపల్లి

ఘనంగా షిర్డీ సాయిబాబా మందిర వార్షికోత్సవం



షిర్డీ సాయిబాబా మందిరానికి పూల దండలతో అందంగా అలంకరణ



భూదేవి, శ్రీదేవి సమేత వేంకటేశ్వరస్వామికి కల్యాణోత్సవ ఘట్టం

కశింకోట: మండలంలోని సోమవరం గ్రామంలో షిర్డీ సాయిబాబా మందిర దశమ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు గొంతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మందిరాన్ని, బాబా విగ్రహాన్ని పలు రకాల పూలదండల చూడ ముచ్చటగా అలంకరించి క్షీర, జలాభిషేకాలు చేశారు. వేదమంత్రోచ్చరణల నడుమ హోమం నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి బాబాను దర్శించుకున్నారు. వేంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి విగ్రహాలకు వైభవంగా కల్యాణోత్సవాన్ని వేద పండితుల సమక్షంలో జరిపించారు. విశాఖపట్నానికి చెందిన బృందం వారు భరత నాట్య ప్రదర్శన నిర్వహించగా, ఆహూతులను విశేషంగా అలరించింది. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన జరిగింది. సాయంత్రం సాయిబాబా ఉత్సవ విగ్రహాన్ని మహిళల కోలాటాలు, డప్పులు, వాయిద్యాలతో గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పి.గణబాబు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ, సర్పంచ్ గొంతిన నాగరత్నం, పలు గ్రామాల సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, తదితరులు హాజరయ్యారు.

వెంకన్న ఆలయాభివృద్ధికి రూ.లక్ష విరాళం

దేవరాపల్లి: మండలంలోని మారేపల్లి ఉత్తర వాహిని శారదానది ఒడ్డున వెలసిన శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయాభివృద్ధికి స్థానిక సర్పంచ్ అవుగడ్డ కన్నతల్లి, కోటిపల్లి నాయుడు దంపతులు రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఇటీవల పునః ప్రతిష్ఠ చేసిన ఈ ఆలయంలో మౌలిక సదుపాయాలకు దాతల నుంచి విరాళాల సేకరణకు అర్చకుడు రాంకుమార్ శుక్రవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దంపతులుతోపాటు గ్రామానికి చెందిన అవుగడ్డ రామారావు రూ.5116 ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో అవుగడ్డ భరద్వాజ్, నెక్కల శ్రీనివాసరావు, అవుగడ్డ అప్పలనాయుడు మాస్టారు పాల్గొన్నారు.



రూ.లక్ష చెక్కు అందజేస్తున్న దాతలు

పరిశుభ్రత విధి నిర్వహణలో భాగం

- రావికమతం పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో హేమంత్

రావికమతం: పీహెచ్‌సీతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అధికారులు, సిబ్బందిదేనని డీఎంహెచ్‌వో హేమంత్ తెలిపారు. రావికమతం పీహెచ్‌సీని ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ముందుగా ఓపీ, గర్భిణుల ప్రసవాల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య, పిల్లల నమోదు పెంచాలని వైద్యాధికారికి సూచించారు. అనంతరం ఆపరేషన్ థియేటర్, ఆస్పత్రి పరిసరాలు పరిశీలించారు. అక్కడక్కడ పిచ్చిమొక్కలు ఉండటాన్ని గమనించారు. అదంతా తొలగించి శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఇదంతా మన విధి నిర్వహణలో భాగమేనని సూచించారు.



పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో హేమంత్

కాపురానికి రాలేదని చాకుతో దాడి

- భార్య గొంతు కోసిన భర్త
- తీవ్ర గాయంతో కేజీహెచ్‌కు తరలింపు
- కొత్తపెంటలో ఘటన

దేవరాపల్లి: కాపురానికి రాలేదన్న అక్కసుతో భర్త చాకుతో దాడి చేసి తన భార్య గొంతు కోసి హత్యకు ప్రయత్నించాడు. ఈ ఘటన మండలంలోని కొత్తపెంటలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ డి. నాగేంద్ర వివరాల ప్రకారం... మండలంలోని ఎస్.జి. నగరం శివారు వద్రపాలెంకు చెందిన చుక్క ప్రకాష్‌కు ఇదే మండలం కొత్తపెంట గ్రామానికి చెందిన సునీతతో 14 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి 11, 13 ఏళ్ల వయసున్న కుమార్తెలు ఉన్నారు. జీవనోపాధి నిమిత్తం వీరి కుటుంబం కొంత కాలంగా కె.కోటపాడులో నివాసం ఉంటోంది. భార్యాభర్తల మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. వ్యసనాలకు బానిసైన ప్రకాష్ తన ఆస్తితోపాటు అత్తమామలు ఇచ్చిన ఆస్తిని దుబారా చేశాడు. ఇదే విషయమై భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు జరగ్గా, పెద్దలు పలుమార్లు సయోధ్య కుదిర్చారు. భర్త ప్రవర్తనలో ఏమాత్రం మార్పు రాకపోవడంతో విసిగిపోయిన ఆమె కొత్తపెంటలోని తన పుట్టింటికి రెండు నెలల క్రితం వచ్చేసింది. ఈ క్రమంలో భార్యను కాపురానికి పంపించాలంటూ ప్రకాష్ అక్కడకు వెళ్లి కోరాడు. దీనికి భార్య నిరాకరించడంతో అప్పటికే తన వెంట తెచ్చుకున్న చాకుతో ఆమెపై దాడి చేసి గొంతు కోసి హత్యకు ప్రయత్నించాడు. భర్త దాడిలో తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానిక కె.కోటపాడు కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక వైద్యం అందించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. నిందితుడు ప్రకాష్ తమ అదుపులో ఉన్నాడని, ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. కె.కోటపాడు ఆస్పత్రిలో సునీత శరీరంపై గాయాలను సీఐ ఎస్. తాతారావు పరిశీలించారు. అంతకు ముందు కొత్తపెంటలో సంఘటనా స్థలాన్ని సందర్శించారు.



సునీత శరీరంపై గాయాలను పరిశీలిస్తున్న కె.కోటపాడు సీఐ తాతారావు

ఫ్యామిలీ డాక్టర్‌పై ప్రజల్లో అవగాహన పెంచాలి

- ఉమ్మలాడలో పరిశీలించిన జిల్లా నోడల్ అధికారి వీరజ్యోతి



ఉమ్మలాడలోని కుటుంబ డాక్టర్ విధానాన్ని పరిశీలిస్తున్న జిల్లా నోడల్ అధికారి డాక్టర్ వీరజ్యోతి

మునగపాక: మండలంలోని ఉమ్మలాడలో శుక్రవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని జిల్లా నోడల్ అధికారి డాక్టర్ వీరజ్యోతి పరిశీలించారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ఇక్కడ అందుతున్న సేవలపై ఆరా తీశారు. రోగులకు సంబంధించిన పరీక్షలు, మందులను ఆమె తనిఖీ చేశారు. ప్రజల్లో ఈ విధానంపై మరింత అవగాహన కల్పించాలన్నారు. ముందురోజు గ్రామాల్లో దండోరా వేయించేలా చూడాలన్నారు. రోగులు కూర్చునేందుకు అవసరమయ్యే వసతి ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. రక్తపోటు.మధుమేహ రోగులను గుర్తించి వారి వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఆమె వెంట డాక్టర్ విజయకుమార్, ఆరోగ్య పర్యవేక్షకురాలు వీఎస్ఎం లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ షాహిన్ అంజూమ్, ఏఎన్ఎం గుణలక్ష్మి, డీఈవో విజయలక్ష్మి, ఆరోగ్య కార్యకర్త జ్యోతిలాల్, ఆశా కార్యకర్తలు కావేరి, విజయలక్ష్మి, వరలక్ష్మి పాల్గొన్నారు.

అక్రమంగా దాచిన టేకు కలప స్వాధీనం



గొలుగొండ కలప డిపోకు తరలించిన టేకు కలపతో అటవీశాఖ అధికారులు

- గొలుగొండ డిపోకు తరలింపు

గొలుగొండ: స్థానిక అటవీ శాఖ సెక్షన్ పరిధి కంతారం గ్రామ సమీపంలో అక్రమంగా దాచి ఉంచిన టేకు కలపను అటవీశాఖ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా గొలుగొండ అటవీ శాఖ సెక్షన్ అధికారి లక్ష్మణ్ మాట్లాడుతూ కంతారం బీట్ పరిధిలో 20 టేకు కలప రవాణాకు సిద్ధంగా ఉంచినట్టు వచ్చిన సమాచారంతో దాడి చేసి పట్టుకున్నామన్నారు. దీని విలువ రూ. లక్ష వరకు ఉంటుందని తెలిపారు. ప్రైవేట్ స్థలంలో ఉండటంతో ఎవరూ కలప తమదని ముందుకు రాలేదన్నారు. పట్టుకున్న కలపను వాహనాల్లో గొలుగొండ కలప డిపోకు తరలించామని తెలిపారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గొలుగొండ సెక్షన్ అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి కేసులో మరొకరు అరెస్టు


అనకాపల్లి టౌన్: మండలంలో బవులవాడ గ్రామం వద్ద ఈ నెల 23 స్వాధీనం చేసుకున్న గంజాయి కేసులో మరో నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు గ్రామీణ ఎస్‌ఐ నర్సింగరావు శుక్రవారం తెలిపారు. ఆ రోజు 15 కేజీల గంజాయితోపాటు ఇద్దరు నిందితులు పట్టుబడగా, మరొకరు పరారయ్యాడని పేర్కొన్నారు. అతడి కోసం గాలించగా పాడేరుకు చెందిన నాదెళ్ల రాజశేఖర్‌గా గుర్తించి అరెస్టు చేశామన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వివాహిత మృతి

మునగపాక: తనకు న్యాయం చేయలేదన్న మనోవేదనతో ఈ నెల 14న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన వివాహిత దివ్య(25) విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. వాడ్రాపల్లికి చెందిన మళ్ల రాము పెద్ద కుమార్తె దివ్యకు మూడేళ్ల క్రితం వివాహమైంది. ఆమెకు భర్తతో విభేదాలు రావడంతో విడిపోయారు. ఆ తర్వాత మండలంలోని కుంచవానిపాలెం గ్రామానికి చెందిన కాయల మురళితో దివ్య ప్రేమాయణం సాగించింది. పెళ్లి చేసుకుందామని భావించగా, ఇందుకు మురళి తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. దీంతో దివ్య మునగపాక పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు విచారణ చేపట్టి గతేడాది డిసెంబర్‌లో పెద్దల సమక్షంలో మునగపాక ఆలయంలో వివాహం జరిపించారు. ఈ నేపథ్యంలో మురళి కుటుంబ సభ్యులతో గొడవలు తలెత్తడంతో తనకు న్యాయం చేయాలని కోరుతూ దివ్య ఈ నెల 14న అనకాపల్లి దిశ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అక్కడే ఆమె మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. దీంతో ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ 12 రోజులుగా చికిత్స పొందుతూ మృతి చెందింది.

బిడ్డ మరణం తట్టుకోలేక ...

- పురుగుమందు తాగి తల్లి ఆత్మహత్య
- కొన్నేళ్ల క్రితం భర్త.. ఇప్పుడు బిడ్డ మృతి
- కరకపల్లిలో విషాదం



మరణించడానికి ముందు చింతపల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బింగు (ఇన్‌సెట్) మృతి చెందిన మోజో(ఫైల్)

చింతపల్లి: కొన్నేళ్ల కిందట భర్త..ఇప్పుడు బిడ్డ మరణించడంతో ఆమె తట్టుకోలేకపోయింది. అప్పటి వరకూ ముద్దు ముద్దుగా మాటలు చెబుతూ తన కళ్లెదుటే ఆడుతూ తిరిగిన తన గారాల పట్టి సాయంత్రం పడుకుని శాశ్వత నిద్రలోకి జారుకోవడంతో ఆ తల్లి హృదయం కకావికలమైంది. తనకు ఈ జీవితమే వద్దనుకుంది. పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. చింతపల్లి మండలం కరకపల్లిలో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. కరకపల్లికి చెందిన కొర్రా కామేశ్వరరావుకు బింగు(20)కు ఆరేళ్ల క్రితం వివాహమైంది. వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్న వీరికి మూడేళ్ల క్రితం కుమారుడు మోజో పుట్టాడు. అంతలోనే వీరిపై విధి పగబట్టింది. అనారోగ్యంతో కామేశ్వరరావు మృతి చెందాడు. అప్పటి నుంచి కూలి పనులు చేస్తూ బిడ్డే ప్రాణంగా జీవనం సాగిస్తోంది. గురువారం సాయంత్రం అప్పటి వరకూ ఆడుతూ కళ్ల ముందు తిరిగిన బిడ్డ నిద్రపోయాడు. అంతే మరి లేవలేదు. ఆ తల్లి తీవ్రంగా తల్లడిల్లిపోయింది. బిడ్డ మరణం తట్టుకోలేని ఆమె పురుగు మందు తాగింది. తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను శుక్రవారం ఉదయం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆమె మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు.

అప్పుల బాధతో కుటుంబం ఆత్మహత్యాయత్నం

- చికిత్స పొందుతూ తల్లిదండ్రులు మృతి
- కుమార్తె పరిస్థితి విషమం
- పెందుర్తి మండలం గొరపల్లిలో ఘటన



మృతులు సత్యనారాయణ, సూర్యకుమారి



చికిత్స పొందుతున్న కుమార్తె నీలిమ

సింహాచలం: అప్పులు తీర్చలేక ఓ కుటుంబం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన విశాఖ జిల్లా పెందుర్తి మండలం గొరపల్లిలో చోటుచేసుకుంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తల్లిదండ్రులు మృతి చెందగా, కుమార్తె పరిస్థితి విషమంగా ఉంది. గ్రామస్తుల కథనం ప్రకారం... గొరపల్లిలో కల్లూరు సత్యనారాయణ (57) కిరణా దుకాణం నడుపుతున్నాడు. అతనికి భార్య సూర్యకుమారి (48), కుమారుడు సంతోష్ (26), కుమార్తె నీలిమ (24) ఉన్నారు. కుమారుడు సంతోష్ ఓ ప్రైవేటు బ్యాంకులో పనిచేస్తున్నాడు. కుమార్తె నీలిమ డిగ్రీ చదివి ఇంట్లోనే ఉంటోంది. సత్యనారాయణ, సంతోష్ ఇటీవల అప్పులు చేశారు. అప్పులు తీర్చమని ఫైనాన్స్ వాళ్లు ఇంటికి వచ్చి డిమాండ్ చేస్తున్నారు. దీంతో మనస్తాపానికి గురైన సత్యనారాయణ, సూర్యకుమారి, నీలిమ గురువారం అర్ధరాత్రి దాటాకా పురుగు మందు తాగారు. ఈ విషయాన్ని సూర్యకుమారి బంధువుకి ఫోన్‌చేసి చెప్పింది. దాంతో సూర్యకుమారి బంధువు, గ్రామస్తులు సత్యనారాయణ ఇంటికి చేరుకున్నారు. ఆ సమయంలో సంతోష్ ఇంట్లో లేకపోవంతో అతనికి సమాచారం ఇచ్చారు. ఇంటికి చేరుకున్న సంతోష్, బంధువులు, స్థానికులు కలిసి వారిని కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఉదయం సత్యనారాయణ, మధ్యాహ్నం సూర్యకుమారి మృతి చెందారు. నీలిమ పరిస్థితి విషమంగా ఉన్నట్టు గ్రామస్తులు తెలిపారు. పెందుర్తి సీఐ ఎం. శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

మండల స్థాయి వైఎస్సార్ క్రికెట్ టోర్నీ ప్రారంభం



వైఎస్సార్ క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు

కశింకోట: కశింకోట మండల పరిషత్ ప్రాంగణంలో దివంగత సీఎం వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని మండల స్థాయి వైఎస్సార్ క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం ప్రారంభమైంది. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రోత్సాహంతో నిర్వహిస్తున్న టోర్నమెంట్‌లో విజేతలకు వైఎస్సార్ వర్ధంతి రోజున బహుమతులు అందజేయనున్నారు. టోర్నమెంట్‌లో మండల గ్రామాల నుంచి 14 జట్లు పాల్గొంటున్నాయి. నాకౌట్ విధానంలో టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని మూడు గ్రామాలకు శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండబోదని ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ రహదారిపై కండక్టర్ మార్పు చేయనున్న కారణంగా ఉగ్గినపాలెం, పరవాడపాలెం, జమాదులపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు నిర్దేశించిన సమయంలో అంతరాయం కలగనుందన్నారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

గుండెపోటుతో శివాలయ అర్చకుడి మృతి



వెలవలపల్లి వెంకట సూర్య శంకరం

కశింకోట: కశింకోటలోని పురాతన సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి(శివాలయం) వంశపారంపర్య అర్చకుడు వెలవలపల్లి వెంకట సూర్య శంకరం (78) శుక్రవారం గుండెపోటుతో శివైక్యం పొందారు. అతనికి భార్య రాజేశ్వరి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. శివాలయంలో పూజారిగా సుమారు 60 ఏళ్ల నుంచి విధులను నిర్వర్తిస్తున్నారు. ఉదయం అర్చకత్వం నిర్వహించి, తన తండ్రి కొండలరావుకు వార్షిక తద్దిన రోజు కావడంతో తర్పణాలు ఇచ్చేందుకు సమాయత్తమవుతూ అకస్మాత్తుగా మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన పార్థివ దేహాన్ని పలువురు దర్శించి శ్రద్ధాంజలి ఘటించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 120 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,350	4,610
రెండో రకం	4,030	4,050
మూడోరకం	3,950	4,000

అనకాపల్లి సినిమాలు

బేబి	: రాజా
ఏం చేస్తున్నావ్	: సత్యనారాయణ స్క్రీన్-1
దక్ష	: సత్యనారాయణ స్క్రీన్-2
జైలర్	: షిర్డిసాయి
కింగ్ ఆఫ్ కోథా	: పర్తిసాయి
గాండీవధారి అర్జున	: వెంకటేశ్వర
మిస్టర్ ప్రెగ్నెంట్	: శ్రీసత్య
బేదురులంక 2012	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 40 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-13 యూనిట్లు, ఓ పాజిటివ్-20 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రరువారం 431 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 387 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

శ్రీ వరలక్ష్మీ నమస్తు వసుప్రదే, సుప్రదే

'వర'అంటే శ్రేష్టమైనది అని అర్థం. వరలక్ష్మి అంటేనే వరాలిచ్చే దేవత. భక్తితో కొలిచేవారికి ధన, ధాన్య, పాడిపశు, గుణ, జ్ఞాన సంపదలెన్నింటినో అందిస్తుంది. అందుకే ఊరూవాడా మహిళలు శ్రావణ మాస రెండో శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతాలు తమ శక్తిమేర ఘనంగా చేశారు. వ్రత పరిసమాప్తి అయ్యాక ముత్తైదువులను పిలిచి, తాంబూలాలందించి వారి ఆశీస్సులు పొందారు.

- భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు
- అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు



కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు



గాజుల అలంకరణలో సంతోషిమాత అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో కనకదుర్గ అమ్మవారు



కన్యకాపరమేశ్వరి అమ్మవారి దర్శనం కోసం ఆలయ ఆవరణలో క్యూ కట్టిన భక్తులు



సత్యనారాయణపురం కనకదుర్గమ్మ ఆలయంలో వరలక్ష్మీ వ్రతం చేస్తున్న గృహస్తులు

అనకాపల్లిటౌన్/అనకాపల్లి రూరల్/కశింకోట: ముత్తైదువులు తమ పసుపుకుంకుమలు కలకాలం నిలవాలని, భర్త ఆయుస్సును కోరి పవిత్ర వరలక్ష్మీవ్రతాన్ని శుక్రవారం పట్టణం, మండలంలోని ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఆచరించారు. ఏటా శ్రావణమాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం రోజున వరలక్ష్మీ వ్రతాన్ని హిందువులంతా ఎంతో సంప్రదాయబద్ధంగా ఆచరించడం ఆనవాయతీ. పలు ఇళ్లల్లో ఆషాఢం స్తబ్దతను తరిమేస్తూ కొత్త జంటలు ఆనందంగా శ్రావణలక్ష్మిని స్వాగతించారు.

పలు గ్రామాల్లోని అమ్మవార్ల ఆలయాల్లో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించడానికి వచ్చిన మహిళలతో సందడి వాతావరణం కనిపించింది. కొన్ని చోట్ల ఆలయాల్లో మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలను ఆచరించారు.

నూకాంబిక ఆలయంలో కుంకుమార్చనలు

గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి వరలక్ష్మీదేవి పూజ నిర్వహించారు. అమ్మవారి ఆలయ మండపంలో ఉచిత కుంకుమ పూజల్లో మహిళా భక్తులు పాల్గొన్నారు. అమ్మవారిని అధికసంఖ్యలో భక్తులు దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారి శ్రీచక్రానికి రేజేటి చక్రవర్తి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో బండారు ప్రసాద్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహాలక్ష్మిగా సతకంపట్టు కనకదుర్గమ్మ

గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మవారి ఆలయంలో అమ్మవారికి అర్చకులు భోగారపు వెంకటరమణ లక్ష్మీపూజ చేశారు. అమ్మవారు మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కర్రి సన్యాసినాయుడు, ఆలయ వ్యవస్థాపకులు పి.వి.రమణ, ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు, పాలిమేర శ్రీను, పాలిమేర మణి, దొడ్డి రవి, ఆళ్ల సూరిబాబు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో..

స్థానిక కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వరలక్ష్మీదేవి పూజలు ఘనంగా జరిగాయి. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి అర్చకులు కుంకుమార్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ ఉప్పల శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గాజుల అలంకరణలో సంతోషిమాత

గవరపాలెం సంతోషిమాత అమ్మవారు గాజుల అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు అధికసంఖ్యలో మహిళాభక్తులు ఆలయానికి బారులుతీరారు. ఆలయ ఈవో ఆదినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

- మండలంలోని సత్యనారాయణపురం కనకదుర్గమ్మవారి ఆలయంలో అమ్మవారిని వివిధ పూలు, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం 6 గంటల నుంచే కుంకుమార్చనలు, ప్రత్యేక పూజల్లో పెద్ద ఎత్తున మహిళా భక్తులు పాల్గొన్నారు. ప్రధాన అర్చకుడు రేజేటి ధర్మాచార్యులు భక్తులతో వ్రతాలు చేయించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ధర్మకర్తల కమిటీ అధ్యక్షుడు యడ్ల త్రినాథరావు, సభ్యుడు బోయిన రమణాజీ ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు.
- కశింకోటలోని పలు ఆలయాల్లో శ్రావణ శుక్రవారం పూజలు ఘనంగా నిర్వహించారు. స్థానిక కనక మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారిని అలంకరించి కుంకుమార్చనలు చేశారు.
- జాతీయ రహదారి వద్దనున్న కనకదుర్గ ఆలయం వద్ద భక్తులు బారులుతీరారు. అమ్మ వారిని వస్త్రాలు, పూల దండలు, ఆభరణాలతో అలంకరించి కుంకుమార్చనలు జరిపారు. భక్తులు చీరలు, రవికెలు, పండ్లు వగైరా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దిగువన మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ వ్యవస్థాపకుడు ఎన్.ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.
- శివాలయంలో ఉదయం సర్వమంగళాంబకు కుంకుమార్చనలు నిర్వహించారు. శివాలయం వద్ద వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు జరిగాయి.
- గవరపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో మహిళా భక్తులు లలిత సహస్ర నామ పారాయణ చేశారు.



కశింకోటలో పూజలు అందుకున్న కనక మహాలక్ష్మి



పూజలందుకున్న కనకదుర్గ అమ్మవారు

హైమాస్ట్ వెలుగులు



గూడ్స్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు

అనకాపల్లిటౌన్: స్థానిక కాశీవిశ్వేశ్వరాలయం, లక్ష్మీదేవిపేట, గూడ్స్‌రోడ్డు ప్రాంతాల్లో హైమాస్ట్ వెలుగులు విరజిమ్ముతున్నాయి. ఆయా ప్రాంతాల ప్రజలు వీధిదీపాల సమస్యను ఇటీవల 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన ఆమె మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు విషయాన్ని చేరవేశారు. ఆయన స్పందించి ఈపీడీసీఎల్ ఏఈను తక్షణ చర్యలకు ఆదేశించారు. వార్డు ఇన్‌చార్జి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాల్లో విద్యుత్ అధికారులు హైమాస్ట్ లైట్లు బిగించారు. దీంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

త్వరితగతిన రోడ్డు, కాలువలు



కనకమహాలక్ష్మి వీధిలో నిర్మిస్తున్న కాలువలు

కశింకోట: రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మంజూరు చేసిన రూ.20 లక్షల నిధులతో స్థానిక కనకమహాలక్ష్మి వీధిలో అంతర్గత సిమెంట్ రోడ్డు, మురికి కాలువల నిర్మాణ పనులు చేపట్టి, వేగవంతంగా నిర్వహిస్తున్నారు. ఇప్పటికే కాలువల కాంక్రీట్ నిర్మాణ పనులు దాదాపు పూర్తయినట్లు వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు శుక్రవారం తెలిపారు. తుది మెరుగులు, రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆత్మీయ పరిచయం

పార్వతీపురం మన్యం జిల్లా చినమేడపల్లి గ్రామంలో సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ శంకుస్థాపనకు హాజరయ్యేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శుక్రవారం ఉదయం విశాఖ విమానాశ్రయం చేరుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్‌ను సీఎం జగన్ కేంద్ర మంత్రికి పరిచయం చేశారు.

-సాక్షి, విశాఖపట్నం



సమస్యలు పరిష్కరించాలని నిరసన

అనకాపల్లిటౌన్: తమ సమస్యలు పరిష్కరించాలంటూ సంచార పశు వైద్యశాల వాహన సిబ్బంది శుక్రవారం నిరసనకు దిగారు. జిల్లా వ్యాప్తంగా 14 వాహనాల్లో 46 మంది సిబ్బంది పని చేస్తున్నట్లు తెలిపారు. తమ కార్యకలాపాలు జీవీకే సంస్థకు ప్రభుత్వం అప్పగించిందని, అయితే గత కొన్ని నెలలుగా జీతాలు చెల్లించట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అపరిష్కృత సమస్యలు, జీతాల చెల్లింపు డిమాండ్లతో విధులు బహిష్కరించి, నిరసనకు దిగినట్లు తెలిపారు.



నిరసన తెలుపుతున్న సంచార పశు వైద్యశాల వాహన సిబ్బంది

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారికి పూజలు

అనకాపల్లిటౌన్: రాష్ట్రం సుభిక్షంగా ఉండేలా, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్ మోహన్‌రెడ్డి గెలిచేలా చూడాలంటూ నూకాంబిక అమ్మవారికి పూజలు చేసినట్లు వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ తెలిపారు. గవరపాలెం నూకాంబిక ఆలయంలో శుక్రవారం నిర్వహించిన హోమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాల నిర్వాకం కారణంగా లోటుబడ్జెట్‌లో ఉన్న రాష్ట్రంపై లక్ష్మీకటాక్షం కలగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి, అమ్మవారి గర్భాలయంలోకి తీసుకెళ్లి దర్శనం కల్పించారు. అంతకు ముందు ఆయన సంతోషిమాత అమ్మవారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నేతలు కొణతాల భాస్కర్, విల్లూరి ప్రసాద్, పీఎస్‌కే నాయుడు, పెతకంశెట్టి గోపి, కొణతాల గోవింద్, కొణతాల పరదేశి నాయుడు, పెతకంశెట్టి శ్రీను, కర్రి ఉమ, మళ్ల రామకృష్ణ, ఎం.రమణబాబు, ఓమాల కాశీ, డీజే నాయుడు, బుద్ధ శేఖర్, వజ్రపు రామకృష్ణ ఉన్నారు.



సంతోషిమాత అమ్మవారిని దర్శించుకుంటున్న దాడి రత్నాకర్

వైఎస్సార్‌సీపీలో నాయీ బ్రాహ్మణులకు సముచిత స్థానం

అనకాపల్లి రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, పార్టీలో నాయీ బ్రాహ్మణులకు సముచిత స్థానం కల్పిస్తున్నారని అనకాపల్లి జిల్లా నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశనకుర్తి అప్పారావు, ప్రధాన కార్యదర్శి కందికుప్ప గోవిందరావు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షునిగా రౌతు శంకర్రావు నియామకంపట్ల వారు పార్టీకి, అధినేత, సీఎం జగన్‌కు శుక్రవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. ఎస్.రాయవరం మండలానికి చెందిన శంకర్రావు విశ్రాంత ఉపాధ్యాయుడు. వృత్తిరీత్యా శ్రీకాకుళం జిల్లాలో స్థిరపడిన ఆయన వైఎస్సార్‌సీపీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. దీనిని గుర్తించిన పార్టీ అధిష్టానం ఆయనకు ఉపాధ్యక్షునిగా పదవి నిచ్చి, గౌరవించడం తమకు ఆనందంగా ఉందన్నారు. ఆయన నియామకం పట్ల జిల్లాకు చెందిన నాయీ బ్రాహ్మణ సంఘం నేతలంతా హర్షం ప్రకటించారు. తమకు సముచిత గౌరవం ఇస్తున్న వైఎస్సార్‌సీపీకి తాము కూడా అదే విధమైన మద్దతును అందిస్తామని తెలిపారు.

ట్రిపుల్ ఐటీకి దిబ్బపాలెం విద్యార్థి



యోగేంద్ర

అనకాపల్లిటౌన్: మండలంలోని దిబ్బపాలెం హైస్కూల్ నుంచి 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థి సిరసపల్లి యోగేంద్ర ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాడు. ఈ మేరకు యోగేంద్రను శుక్రవారం గ్రామ ఎంపీటీసీ పి.అచ్చియ్యమ్మ, హెచ్ఎం ఉమామహేశ్వరరావు, స్కూల్ కమిటీ చైర్మన్ యల్లపు రామచంద్రరావు, కమిటీ సభ్యులు అభినందించారు.

సెజ్ భూ సేకరణ పునరావాసంపై సర్వే

రాంబిల్లి: సెజ్ రెండో విడత భూసేకరణలో ఉన్న కృష్ణంపాలెం గ్రామంలో పునరావాసం కోసం నిర్వహిస్తున్న సర్వేకు సహకరించాలని ఆర్డీవో చిన్నికృష్ణ కోరారు. శుక్రవారం గ్రామంలో గ్రామసభను నిర్వహించారు. కొన్నేళ్లుగా సర్వే చేయడమే తప్ప, పునరావాసం కల్పించలేదని అలాంటపుడు సర్వే ఎందుకని గ్రామస్తులు ప్రశ్నించారు. ఈసారి హరిపురం, పంచదార్ల వద్దనున్న బీసీటీ సంస్థ సమీపంలో పునరావాస స్థలాలు కేటాయిస్తామని, సర్వేకు సహకరించాలని ఆర్డీవో కోరారు.



మాట్లాడుతున్న ఆర్డీవో చిన్నికృష్ణ

చంద్రయాన్-3 విజయం గర్వకారణం

అనకాపల్లిటౌన్: చంద్రయాన్-3 విజయం భారతీయులందరూ గర్వించదగ్గ విషయమని ఏఎంఏఎల్ కళాశాల విశ్రాంత అధ్యాపకుడు విల్లూరి అప్పలస్వామినాయుడు అన్నారు. స్థానిక పాలూరి చిదంబరం మెమోరియల్ రోటరీ హాలులో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విజయం వెనుక ఇస్రో తీసుకున్న జాగ్రత్తలను వివరించారు. భారతదేశ మాజీ రాష్ట్రపతి, దివంగత అబ్దుల్ కలాంను కలవడం తన జీవితంలో మరిచిపోలేని అనుభూతిని మిగిల్చిందన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం గవర్నర్ వ్యవస్థ అధికారాలు, ఆర్టికల్ 356 ప్రాధాన్యత, దుర్వినియోగంపై వివరించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు పి.జె.నాయుడు, కార్యదర్శి ఆడారి రామకృష్ణ, కోశాధికారి రాపేటి నారాయణరావు, అధిక సంఖ్యలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అప్పలస్వామినాయుడు

సూరిశెట్టికి అభినందనలు



రమణ అప్పారావుకు కృష్ణుడి విగ్రహాన్ని అందిస్తున్న పార్టీ శ్రేణులు

అనకాపల్లిటౌన్: వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సూరిశెట్టి రమణ అప్పారావును శుక్రవారం ఆయన స్వగృహంలో జిల్లాకు చెందిన పలువురు పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. రమణ అప్పారావు నియామకం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. అంతకుముందు రమణ అప్పారావుకు జిల్లా యువజన నాయకులు కర్రి మహాలక్ష్మినాయుడు, సత్యదేవ్ ఆస్పత్రి అధినేత డాక్టర్ లక్ష్మీనర్సింహారావు, బొడ్డేడ కిరణ్, 82వ వార్డు యువజన నాయకులు బొడ్డేడ కిరణ్, విల్లూరి సంతోష్, చోడవరం పార్టీ వెలమ విభాగం నేత జూరెడ్డి పృథ్వీరాజ్‌లు దుశ్శాలువ కప్పి, కృష్ణుని విగ్రహాన్ని బహూకరించారు.

రేపు నగర సాంఘిక్

అనకాపల్లిటౌన్: స్థానిక సిటీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఈ నెల 27న నగర సాంఘిక్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నగర సంఘ చాలక్ విల్లూరి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటలో తెలిపారు. ఉదయం 7 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన మానవీయ విభాగ్ చాలక్ గోవింద్ పాల్గొంటారని తెలిపారు. ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు హాజరుకావాల్సిందిగా కోరారు.

నేడు రహదారి విస్తరణపై సమావేశం

అనకాపల్లిటౌన్: స్థానిక నూకాంబిక ఆలయ ఆర్చ్ నుంచి పూల్‌బాగ్ రహదారి, పవన్ సిటీసెంటర్ వరకు 2.20 కిలోమీటర్ల మేర రోడ్డును విస్తరించనున్నట్లు జెడ్సీ చక్రవర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రహదారికి ఇరువైపులా ఉన్న ఆస్తి, భవన సముదాయ యాజమానులతో శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు గవరపాలెం పెదరామస్వామి కల్యాణ మండపంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి యజమానులు విధిగా హాజరుకావాలని కోరారు.

కశింకోటలో వర్షం

కశింకోట: కశింకోట ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో అకస్మాత్తుగా వర్షం పడింది. దీంతో వాతావరణం చల్లబడింది. గత కొద్ది రోజులుగా కాస్త వేడి ఉష్ణోగ్రతలతో సతమతమవుతున్న ప్రజలు ఉపశమనం పొందారు. వరి నారుమళ్లకు వర్షం కాస్త ఉపకరిస్తుందని రైతులు తెలిపారు.

అట్టహాసంగా ఓనం వేడుకలు



ఇండియన్ మారిటైం విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న ఓనం పర్వదిన వేడుకలు



సాంప్రదాయ నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్న విద్యార్థులు

సబ్బవరం: ఇండియన్ మారీ టైం విశ్వవిద్యాలయంలో వరలక్ష్మీవ్రతం, ఓనం పర్వదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయ డైరెక్టర్ వీకే కేశవదేవ్ ఓనం ప్రాశస్త్యాన్ని విద్యార్థులకు వివరించారు. సిరిసంపదలను తీసుకువచ్చే ఎంతో సంతోషకరమైన రోజు అని తెలిపారు. పండగను పురస్కరించుకొని వర్సిటీ ప్రాంగణాన్ని రంగవల్లులతో అలంకరించి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన పలు సాంస్కృతిక పోటీల్లో భాగంగా విద్యార్థుల సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. క్రీడా పోటీల్లో విజేతలకు డైరెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. సాంప్రదాయ వంటలతో ఏర్పాటు చేసిన విందు భోజనాలతో కార్యక్రమాన్ని ముగించారు. కార్యక్రమంలో హెచ్‌వోడీ ఎస్. జనార్దన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయి చరణ్, జె.రాజు, ప్రొఫెసర్స్ శ్రీ పద్మ, ఎం.ప్రేమ్ చంద్, జి.అవినాష్, ఎ. కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ

పరవాడ: పరవాడ సంతబయలులో కొలువుదీరిన శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శనివారం ఉదయం 11.11 గంటలకు భూమి పూజ చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు చెప్పారు. ప్రముఖ సిద్ధాంతి శ్రీమాన్ రేజేటి రామాచార్యులు (రాంబాబు) భూమి పూజ కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, పెద్దలు, యువత పాల్గొని విజయవంతం చేయాలని శ్రీనివాసరావు కోరారు.

ఘనంగా గ్రంథాలయ వార్షికోత్సవం

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లిలో స్వర్గీయ పెతకంశెట్టి జోగినాయుడు మాస్టారు గ్రంథాలయ 12వ వార్షికోత్సవ కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా తొలి రోజు పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. వేడుకలను సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, గ్రంథాలయ కమిటీ గౌరవ అధ్యక్షులు రామజోగినాయుడులు సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయాలకు రావడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకునే అవకాశం ఉంటుందన్నారు. 26, 27, 28 తేదీల్లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామన్నారు. 28న వేడుకల ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతులు అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు మళ్ల వరహానరసింగరావు తదితరులు పాల్గొన్నారు.



వాడ్రాపల్లిలో పుస్తక ప్రదర్శన